# తాత ప్రాణం.

డా|| కె. రవీంద్రబాబు

"అమ్మా తాతయ్య ఏడీ?" ఉదయం పదిగంటలకు నిద్రలేచి తల్లి అందించిన కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంటూ అడిగాడు భాస్కరరావు.

"చీకటితోటే పొలం వెళ్ళిపోయాడు" అంది తల్లి సుందరమ్మ.

"పొలంలో ఇప్పుడేం పనివుంటుంది?" బెడ్‌కాఫీ చప్పరిస్తూ అడిగాడు భాస్కరరావు.

"ఆ మాట అడగకురా బాబీ – మున్నూట అరవై అయిదురోజులూ ఎడతెగని పని వుంటుంది మీ తాతకి. చీకటి వుండగానే నిద్రలేచి గొడ్ల సావిడి బాగుచేసి, పాలుతీసి, చెట్లకు నీళ్ళు పోసి తెల్లారేసరికి పొలానికో, తోటకో వెళ్ళి పొద్దు నెత్తిమీద వుండగా వస్తాడు.

నాలుగు మెతుకులు తిని నిముషం నడుం వాల్చకుండా మళ్ళీ సావిట్లోకి, అక్కడ్నుంచీ పొలానికీ వెళతాడు. చీకటిపడుతుండగా వచ్చి గొడ్ల సావిట్లో పని చూసుకునిగాని ఇంట్లోకిరాడు.

అప్పుడు స్నానంచేసి భోంచేసి మళ్ళీ తోటదగ్గరకు వెళతాడు. పగలు కరెంటు వుండకపోవడంతో రాత్రి ఇంజను వదలి నీళ్ళు పెడతాడు.

ఏ నడి రాత్రికాడో వచ్చి పడుకుని తెల్లారకముందే లేస్తాడు.

నీకెందుకీ శ్రమ అంటే జవాబు చెప్పడు" ముసలయ్యతో తాను పడ్తున్న క్షోభ కొడుకు ముందు వెళ్ళబుచ్చింది సుందరమ్మ.

"అమ్మా తాతయ్యకు చెప్పలేదా? రాత్రి పొలం కౌలుకిచ్చేయమని అంటే మాట్లాడలేదు!"

"చెప్పడు రాలా – ఇష్టంలేని మాటలు విననట్లు వూరుకుంటాడు. మళ్ళీ సావిట్లో దూడ అరిస్తే లేచి పరుగెత్తుకు వెళతాడు."

"అమ్మా రాత్రి నేను బస్సు దిగి వస్తుంటే సూరయ్య బాబాయి, లక్ష్మయ్య మామ కనపడ్డారు. 'మీ తాతను నీ వెంట టౌనుకు తీసుకు వెళ్ళు. ఇక్కడే వుంటే ఆటే కాలం బతకడు – తిండీ నిద్రా లేకుండా ఒకటే పని చేస్తుంటాడు. అయినా ఇంకా గుంజాటన పడి సంపాదించి పోషించడానికి ఎంతమంది వున్నారేం? లింగులిటుకుమంటూ నువ్వొక్కడివే గదా?' అని నిష్ఠూరంగా మాట్లాడారు" నొచ్చుకుంటూ అన్నాడు భాస్కరరావు.

"ఊరంతా కోడై కూసినా ఆయన చెవిలో దూరబడదు. నలుగురూ నిన్నూ, నన్నూ నానా మాటలు అంటున్నా ఆయనకేం పట్టడంలేదు" సుందరమ్మ కంఠంలో నిష్ఠూరం కంటే కోపం ఎక్కువ పలికింది.

"ఉద్యోగస్థులు ఏభై ఎనిమిదేళ్ళకు రిటైరవుతుంటే తాతయ్య డెబ్బై ఏళ్ళొచ్చినా డబల్ పని చేస్తున్నాడన్నమాట" సాలోచనగా అన్నాడు భాస్కరరావు.

"డెబ్బై ఏళ్ళేమిట్రా – నాకే అరవై దాటితే తాతకి ఎనభై అయిదు పైనే వుంటుంది!"

"ఇవ్వాళ తాతయ్య రాగానే తేల్చేస్తానుండు" ఒక నిర్ణయానికి వస్తూ అన్నాడు భాస్కరరావు.

స్నానం చేసి భోంచేసి తాత కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు భాస్కరరావు. పన్నెండు గంటలయినా తాత ఇంటికి రాకపోవడంతో మంచంమీద పడుకుని నిద్రపోయాడు.

రెండున్నరకి మెలకువ వచ్చింది. కళ్ళు నులుముకుంటూ వంటగదిలోకి వెళ్ళాడు భాస్కరరావు.

"అమ్మా తాత రాలేదా?"

"వచ్చాడురా – గబగబా నాల్గు మెతుకులు నంజి ఆదరాబాదరాగా వెళ్ళిపోయాడు. అబ్బాయి నీతో మాట్లాడాలంటున్నాడన్నా వినిపించుకోనట్లు వెళ్ళిపోయాడు" వేడి గారెలు కొబ్బరి చట్నీ వున్న ప్లేటు కొడుకు ముందుంచుతూ అంది సుందరమ్మ.

గారె తుంపి నేతిగిన్నెలో ముంచి కొబ్బరి చట్నీ నంజుకుని తిన్నాడు భాస్కరరావు. బ్రేవ్‌మని త్రేన్చుతూ లేచాడు.

○ ○

"ఓరి ఓరి – తోటలో చెట్టు చిగురిస్తేనే ఎంతో సంతోషంగా వుంటుంది. మన వంశం నిలబెట్టేవాడు పుడుతున్నాడని చెప్పావు. అంతకన్నా మంచి వార్తేముంటుంది. అట్లాగే బస్తీకి వస్తా"

"అదేమిట్రా అప్పుడే లేచావు – పట్టుమని పది గారెలైనా తినలేదు" అంది సుందరమ్మ నొచ్చుకుంటూ.

"ఇంకా ఏం తినేదే – ఇంటి దగ్గరైతే నాలుగు మించి తినను. నేతితో వండినట్లున్నావు. ఆరోగ్యానికి మంచిది గాదంటున్నారు!"

"సింగినాదం గాదూ – మీ తాతయ్య ఇప్పటికీ యాభై గారెలు ముంతెడు నెయ్యితో ముంచుకుతింటాడు."

భాస్కరరావు పాంటు షర్టు బూట్లు వేసుకుని తాతదగ్గరకు బయల్దేరాడు.

చిన్నప్పుడు అనేకమార్లు పొలం వెళ్ళినా కాలేజీలో చేరిందగ్గర్నుండీ పొలం రావడం తగ్గిపోయి, ఉద్యోగంలో చేరిన దగ్గర్నుండీ ఒక్కసారీ పొలంవైపు రాలేదు. బాగా తెలిసిన దారే కొత్తగా అన్పించింది.

పొలం గట్టుమీద బూటుకాలు జారి రెండు మూడుమార్లు పడబోయాడు.

"బూట్లు వేసుకురావల్సింది గాదు" అనుకున్నాడు.

వరిచేను, చేనుని అనుకుని నిమ్మతోట వున్నాయి. రెంటికీ మధ్య ఇంజను షెడ్డు, షెడ్డు ముందరుగు.

అరుగు మీద చతికిలబడి బూట్లు విప్పి నొప్పిచేసిన చీలమండను సవరించుకుంటూ పొలంవైపు చూశాడు.

కోసిన వరిచేను మాసినగడ్డంలా కనపడింది. చేను గట్టుకు కర్రతో బెజ్జాలువేసి అందులో మినుములు చల్లుతూ కనపడ్డాడు తాత.

బెణికిన కాలుతో కుంటుకుంటూ

తాతవైపుగా నడిచాడు.

"ఎవురామడిసి – ఓరి బాబీ నువ్వం టరా? ఏమిటి అలా కుంటుతున్నావు" పళ్ళన్నీ బయటపడేలా నవ్వుతూ అన్నాడు తాత.

"నేనే తాతా – నీతో మాట్లాడుదా మని వచ్చా. విత్తులు నువ్వు చల్లకపోతే కూలిమనిషి చల్లడా?"

"ఇదెంత పనిరా – ఈ భాగ్యానికి కూలిమనిషా"

"తాతా – నువ్వీ వయసులో ఇలా కష్టపడడం దేనికి? నల్గురూ నన్నెగ తాళి చేస్తున్నారు. మా ఇంటికొచ్చి వుండరాదా?"

"అరే ఆ మాటనబాక. ఇక్కడ హాయిగా పైరగాలి పీల్చుకుబతుకు తున్నా. బస్తీకొచ్చి బందిఖానాలాటి చిన్నగదుల్లో వుండి ఆ పొగ దుమ్ము మధ్య బతకలేన్రా."

"ఎట్టెట్టా? కడుపులో వుంది మొగ పిల్లాడని డాక్టరు చెప్పాడా?" ఆశ్చర్యం, సంతోషం తాత గొంతుసిండా పలి కింది.

"అవును తాతా – ఇకనైనా బస్తీకి వస్తావా?"

"ఓరి ఓరి – తోటలో చెట్టు ఇగురే స్తేనే ఎంతో సంతోషంగా వుంటుంది. మన వంశం నిలబెట్టేవాడు పుడుతు న్నాడని చెప్పావు. అంతకంటే మంచి వార్తేముంటుంది. అట్టాగే బస్తీకి వస్తా. మునిమనుమడిని చూచినాక మళ్ళీ ఇంటికి తిరిగివస్తా!" అన్నాడు ఆనందంగా.

తాత గట్టుమీద మినుములు విత్తడం పూర్తిచేశాడు. తోటలో రాలిన కొబ్బరిమట్టలు కట్టకట్టుకుని నెత్తి మీదుంచుకుని భాస్కరరావు వెంట ఇంటికి బయల్దేరాడు తాత.




తాతను ఎలా ఒప్పించాలో తెలియక క్షణం ఆలోచించాడు భాస్కరరావు.

"తాతా – మనవరాలు నీళ్ళో సుకుంది. నేడో రేపో కనడానికి సిద్ధంగా వుంది. నేను ఆఫీసుకి వెళ్తే ఇంట్లో ఒక్కర్తి బిక్కుబిక్కు మంటూ వుంటుంది. నువ్వింట్లో వుంటే మనిషి ధైర్యంగా వుంటుంది."

"అట్లాగా – అమ్మాయి నీళ్ళోసు కుందా? నాకు తెలీదురా" కుతూహ లంగా అడిగాడు తాత.

"అవును తాతా – కడుపులో వుంది మొగపిల్లాడని స్కానింగ్ చేసిన డాక్ట రుగారు చెప్పారు." వేడిమీదున్నప్పుడే ఇనుమును సాగదీయాలన్న సామెత మనసులో మెదలింది భాస్కరరావుకు.



మౌనగీతం

మనిద్దరం కలిసి వుంటామని నువ్వెప్పుడూ అనలేదు.
నేననుకున్నా గాని
జీవితంలో తీపి జ్ఞాపకాలుగానీ, చేదు బాధలుగానీ
నాతో పంచుకుంటావని నువ్వనలేదు.
నేననుకున్నా గాని
నిస్తేజమైన నా జీవితంలో శ్వేత కాంతుల్ని నింపుతావని నువ్వనలేదు.
నేననుకున్నా గానీ
నీ మాటల్నే అర్థం చేసుకోలేనివాణ్ణి ఇప్పటి నీ మౌనాన్నేం అర్థం చేసుకోగలను.
నా వెర్రి గాని!

— కె.ఎ.ఎన్.భుక్త

తాత నెత్తిన కొబ్బరిమట్టలు పెట్టుకుని రావడం భాస్కరరావుకు ఎంతో చికాకుకల్గించింది. రోడ్డుమీద వస్తుంటే ఎదురైన జనం తనను తాతను చూసి ఎగతాళిగా నవ్వుతున్నారనిపించి మనసులో అవమానభారంతో బాధపడసాగాడు.

దానికితోడు రోడ్డుమీద పేడ కనపడంగానే నెత్తినున్న మోపు కిందకుదించి పేడను రోడ్డుపక్కన వుంచి మళ్ళీ మోపు నెత్తినెట్టుకోసాగాడు.

"తాతా రోడ్డుమీద పేడ పోగుచేయకపోతే ఏం?" కోపంగా అడిగాడు భాస్కరరావు.

"నేను జాగ్రత్త చేయకపోతే కార్లు తిరిగీ, బళ్ళు తిరిగీ పేడ వృధా అయిపోతుంది. అయినా మండిపోయే ధర పోసి గోతాల్తో తెచ్చే ఎరువువల్ల పొలానికి లాభంకంటే నష్టం ఎక్కువ. సావిట్లో ఈ మోపు పడేసి తట్ట తీసుకొచ్చి పేడ ఎత్తుకెళ్ళి పెంటపోగులో వేస్తా. మంచి ఎరువవుతుంది."

మనసులో కోపం పెరిగిపోయి తాత నేమీ అనలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు భాస్కరరావు.

** ** **

బంధువులకు, ఇరుగుపొరుగు రైతులకు అనేకమార్లు పొలం, తోట చూస్తుండమని చెప్పి బస్తీకి బయల్దేరాడు తాత.

బస్తీలో భాస్కరరావు వుంటున్నది సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్. ఆకాశంలో హాయిగా తిరిగే పక్షిని తీసుకొచ్చి పంజరంలో బంధించినట్లుగా అనిపించింది తాతకి.

పడకగది, చిన్న కిచెన్ కాక మిగిలి వున్న హాలులోనే భోజనం పగలంతా కూర్చోడం, అతిథులు వస్తే ఆదరించడం, రాత్రి తాత పడక.

భాస్కరరావు భార్య లక్ష్మికి తాత పద్ధతులేం నచ్చలేదు. నీరుకావి బట్టలు, సోఫాలో కాళ్ళు పెట్టి కూర్చోడం, ఇతరుల ఎదుట భర్తని 'బాబిగా' అని పిలవడం ఆమెకు కంపరం కల్గించాయి.

దానికితోడు వచ్చిన మరుసటిరోజు నుంచీ తోటలో కొత్తగా పెట్టిన నిమ్మకాయ మొక్కలకు నీళ్ళు పెట్టారోలేదో, పొలంలో మినప మొక్క మూడాకులు వేసిందో లేదో, ఎర్ర గేదె సరిగ్గా పాలిస్తున్నదో లేదో, వూళ్ళో మిక్కుటమవుతున్న కోతులు కొబ్బరికాయలు ఆగం చేస్తుండివుంటాయి అంటూ ఆందోళన పడిపోసాగాడు తాత.

భాస్కరరావు ఇల్లు రద్దీ వున్న రోడ్డుమీద వుండడంతో దుమ్ము ధూళి పొగవచ్చి తాత విపరీతంగా దగ్గసాగాడు.

ఇంటి దగ్గర కడుపునిండా తినడానికి అలవాటుపడ్డ తాత మనుమరాలు చిన్న చిన్న ప్లేట్లలో చేయి విదిలించినట్లు పెట్టే తిండి చాలక ఆ విషయం పైకి చెప్పలేక మథనపడిపోసాగాడు.

కాసేపు బయట బజార్లో తిరుగుదామని రోడ్డుమీదకు వస్తే కందిరీగల్లా తిరిగే కార్ల హడావిడికి హడలిపోయేవాడు. పగలు కదలకుండా సోఫాలో కాళ్ళు ముడుచుకు కూర్చోడం రాత్రి అక్కడే పడుకోడంతో పిచ్చెక్కినట్లయిన తాతకు దగ్గుతో ఆయాసం, కాళ్ళకు నీరు వచ్చి రొప్పసాగాడు. అడుగువేస్తే దడవచ్చి వూగిపోసాగాడు.

భాస్కరరావు మీద లక్ష్మి విసుక్కోవడం ఎక్కువయింది. "అనవసరంగా తాతను తీసుకొచ్చారు. ఇంటావిడ 'ముసలాయనకేమిటి జబ్బు? కాళ్ళకు నీరొస్తే బతకరు. డాక్టరుకు చూపించి మందులిప్పించి వూరికి పంపెయ్యండి. నలుగురుండే ఇంట్లో ఏమయినా జరిగితే ఆక్షేపిస్తారు. ఘడియ మంచిది గాకపోతే ఇల్లు పాడుపెట్టాలి' అంది. తాతను వూరికి పంపించండి" అంది.

భార్య మాటలకు భయపడ్డ భాస్కరరావు తాతను డాక్టరుగారికి చూపించాడు. "టాకికార్డియా, హార్ట్‌ఫెయిల్యూర్, బిపి, కొలెస్టెరీమియా – పరిస్థితి ఏం బాగాలేదు" అని మందులు రాసిచ్చాడు డాక్టర్.

తాత డాక్టరిచ్చిన మందులు తీసుకోనన్నాడు. "అరేయ్ బాబీ నాకే రోగం లేదు నన్ను ఇంటిదగ్గర దిగవిడిచిరారా" అన్నాడు.

ఇంటావిడ, భార్య అదే పనిగా చెబితే తాతను తీసుకువెళ్ళి ఇంటిదగ్గర దిగవిడిచి వచ్చాడు భాస్కరరావు.

తాతను దిగవిడిచి వచ్చిన తర్వాత నెలరోజులకు లక్ష్మికి ఆపరేషన్ చేసి మగబిడ్డను తీశారు.

మనమడు పుట్టిన వార్త విని వచ్చింది సుందరమ్మ. భయపడ్తూ తల్లినడిగాడు భాస్కరరావు "తాతకె లాగుందే?" అని.

"మీ తాతకేంరా! తిరగలిపిడిలా వున్నాడు. ఊపిరాడకుండా పొలానికి, తోటకి వెళ్ళి విరగబడి చాకిరీ చేస్తున్నాడు" అంది.

"డాక్టరుగారి మందులు పనిచేశాయి గాబోలు" సంతోషంగా అన్నాడు భాస్కరరావు.

"డాక్టరుగారి మందులు ఎప్పుడో అవతలపారేశాడు. ముసలాయనకు ఇల్లు, తోట, పొలం చూడగానే ప్రాణం లేచొచ్చి అన్ని జబ్బులు ఎగిరిపోయాయి" అంది సుందరమ్మ. ●

## ఫలించిన పథకం

కాశీ విశ్వవిద్యాలయం సంస్థాపకుడయిన పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా మొదట్లో విశ్వవిద్యాలయ స్థాపనకు చందాలు పోగుచేయడానికి భారతదేశం అంతటా తిరిగారు. మాలవ్యా అప్పట్లో ఒక బ్యాంకు అధిపతి దగ్గరకు చందాకు వెళ్ళారు. ఆ బ్యాంకు యజమాని అప్పటికే ఆర్థికపరమైన చిక్కుల్లో వున్నాడు.

అందువల్ల తానేమీ చందా ఇవ్వలేనని ఆ బ్యాంకు అధిపతి మాలవ్యాకు విన్నవించుకున్నాడు.

మాలవ్యా కాసేపు ఆలోచించి "ఒక పని చేస్తే వ్యాపారం బాగుపడుతుంది. నీవు అయిదు లక్షలకు చెక్కు రాసి నాకివ్వు" అన్నాడు.

దానికి బ్యాంకు అధిపతి "అంత సొమ్మే వుంటే బ్యాంకు దివాళా తీసే పరిస్థితి ఎందుకు వస్తుంది" అని అడిగాడు.

"ముందు నేను చెప్పినట్టు చెయ్యి" అన్నాడు మాలవ్యా.

బ్యాంకు అధిపతి ఇదెందుకు వచ్చిందో చూద్దామని అయిదు లక్షలకు చెక్కురాసి మాలవ్యాకు ఇచ్చాడు.

అయిదు లక్షల రూపాయలను ఆయన కాశీవిశ్వవిద్యాలయానికి చందాగా ఇచ్చినట్టు మర్నాడు పేపర్లలో ప్రముఖంగా వార్త రావడంతో ఆ బ్యాంకు పేరు కూడా పైకి వచ్చి బ్యాంకుపై ఖాతాదార్లకు బాగా నమ్మకం కుదిరింది. అందులో సొమ్ము దాచుకోవడం ప్రారంభించారు. ఆటోమాటిక్‌గా బ్యాంకు వ్యాపారం పుంజుకుంది.

— జి. పనిసిరెడ్డి, వి. సావరం